క్లుప్తంగా

ఉరేసుకుని యువకుడి మృతి

చిట్యాల: భార్య కాపురానికి రావడం లేదని మద్యానికి బానిసై ఉరి వేసుకుని పెద్ది సురేష్(35) మృతి చెందిన సంఘటన మండలంలోని కాల్వపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాల్వపల్లి గ్రామానికి చెందిన పెద్ది సురేష్ కొంత కాలంగా కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడేవాడు. దీంతో భార్య లక్ష్మీ నెల రోజుల క్రితం తల్లిగారింటికి వెళ్లి రావడం లేదు. సురేష్ మనస్థాపం చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ తెలిపారు.

శతాధిక వృద్ధురాలి..


రాజమ్మ (ఫైల్)

వెంకటాపురం(ఎం): మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన అబ్బ రాజమ్మ (106) శతాధిక వృద్ధురాలు బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, మృతురాలి కుటుంబాన్ని గురువారం గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు అశోక్, పోశాల వీరమల్లు, లింగాల రమణారెడ్డి, చంటి భద్రయ్య, దగ్గు ప్రభాకర్‌రావు, కాసర్ల కుమార్‌లు పరామర్శించారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



చిట్యాల: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన సంఘటన మండలంలోని చల్లగరిగ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాధితురాలు, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చల్లగరిగ గ్రామానికి చెందిన ఇంచర్ల లక్ష్మికి చెందిన పాడి గేదె మేతకోసం గ్రామ శివారులోకి వెళ్లింది. ఈ క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు తాకి షాక్‌గురై అక్కడిక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని బాధితురాలు తెలిపింది. అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వేడుకుంది.

పెండింగ్ సమస్యలు తీరేనా?

- భూపాలపల్లి నుంచి కాటారం డివిజన్‌కు తరలుతున్న భూసేకరణ ఫైల్స్

మల్హర్: కాటారంలో నూతనంగా నెలకొల్పిన రెవెన్యూ (సబ్ కలెక్టర్) డివిజనల్ కార్యాలయంలో సాధారణ పనులు మాత్రమే కొనసాగుతున్నాయి. ఈ డివిజన్ పరిధిలోని మల్హర్ మండల పరిధిలోని తాడిచర్ల , కాపురం గ్రామాల పరిధిలో పెద్ద ఎత్తున జెన్‌కో ఆధ్వర్యంలో ఓసీపీ ద్వారా బొగ్గు తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో భూసేకరణ విభాగంలో అనేక సమస్యలు తలెత్తాయి. వీటిని సత్వరమే పరిష్కరించాల్సిన రెవెన్యూ విభాగం కనీసం ఫైళ్లను కూడా డివిజన్ కార్యాలయానికి చాలాకాలం పాటు తరలించలేదు. ఇటీవల కాలంలోనే భూసేకరణకు సంబంధించిన దస్తావేజులను తరలిస్తున్నారు.


కాటారం సబ్ కలెక్టర్, సబ్ డివిజన్ కార్యాలయం

భూపాలపల్లి రెవెన్యూ డివిజన్ కార్యాలయంలోనే ఉన్నాయి. దీంతో పలుమార్లు తమ దస్త్రాలను కాటారానికి తరలించాలని పలుమార్లు అధికారులకు విన్నవించారు. దీంతో స్పందించిన ప్రభుత్వం ఎట్టకేలకు భూసేకరణ ఫైళ్లు కాటారానికి తరలిస్తున్నారు. ఫైళ్ల తరలింపు నత్తనడకన సాగుతోంది. మరో 10 రోజుల్లో ల్యాండ్ అక్వేషన్ ఫైల్స్ పూర్తిస్థాయిలో కార్యాలయానికి చేరనున్నట్లు తెలిసింది.

నత్తనడకన తరలింపు

జిల్లాల ఏర్పాటు అనంతరం ఉమ్మడి కరీంనగర్‌లోని మంథని నియోజకవర్గం డివిజన్ కార్యాలయం నుంచి తూర్పు మండలాలు (మల్హర్, కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, నూతన పలిమెల) భూపాలపల్లి జిల్లాలో కలిపారు. దీంతో మంథని రెవెన్యూ డివిజన్‌పరిధిలోని తాడిచర్ల ఓపెన్ కాస్ట్ ల్యాండ్ అక్వేషన్ కాగితాలన్నీ భూపాలపల్లికి తరలించారు. ఇది జరిగిన పదేళ్ల తర్వాత గత 2023 సంవత్సరంలో కాటారం కేంద్రంగా రెవెన్యూడివిజన్ ఏర్పాటు చేశారు. కార్యాలయం ఏర్పాటు చేసి నెలలు గడిచినా తాడిచర్ల మైన్స్‌కి సంబంధించిన భూసేకరణ ఫైళ్లు మాత్రం

పెండింగ్‌లోనే సమస్యలు

ఓపెన్‌కాస్ట్ ఏర్పాటుకు జెన్‌కో సంస్థ తాడిచర్ల, కాపురం గ్రామాల పరిధిలో 2295పై చిలుకు ఎకరాల భూమిని నిర్వాసితుల నుంచి సేకరించారు. ఇందులో 753 ఎకరాలకు పైగా పట్టాభూమి, అటవీశాఖకు చెందిన 132 ఎకరాలు ఉండగా మిగతాది ప్రభుత్వ భూమిగా ఉంది. అదే విధంగా కన్వేయర్ బెల్ట్ ఏర్పాటుకు కాపురం, అన్సాన్‌పల్లి గ్రామాల్లో 8.31 ఎకరాల పైచిలుకు, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటుకు 16 ఎకరాల పైచిలుకు భూమిని నిర్వాసితుల నుండి సేకరిచారు. భూపాలపల్లి జిల్లా ఏర్పాటు అనంతరం మంథని డివిజన్ కార్యాలయంలోని 600 ఎకరాలపై చిలుకు సంబంధించిన పెండింగ్ ల్యాండ్ అక్వేషన్ పత్రాలు భూపాలపల్లి డివిజన్ కార్యాలయానికి చేరుకున్నాయి. వీటిలో 500 ఎకరాల మేరకు నిర్వాసితులకు అధికారులు పరిహారం అందించారు. ఈ భూమిలో కోర్టు కేసులు, అభ్యంతరాలు ఇతర సమస్యలతో సుమారు 90 ఎకరాలు ఏళ్లుగా పరిహారం పెండింగ్‌లో ఉంది. అలాగే ఆర్‌అండ్‌ఆర్ సంబంధించిన 9 మందికి నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో పాటు 137 మందికి ప్లాట్స్ పంపిణీ చేయాల్సి ఉంది. తాడిచర్ల డేంజర్ జోన్‌కు ఇళ్ల సేకరణ పీఎస్ ప్రకటనుకే పరిమితం చేశారు. మంథని, భూపాలపల్లి డివిజన్ కార్యాలయాల్లోని పెండింగ్ కాగితాలు అటు ఇటు తిరుగుతునే ఉన్నాయి కానీ వాటికి పరిష్కార మార్గలు మాత్రం దొరకడం లేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నూతన కార్యాలయంలో అయినా తమ భూ సమస్యలు ఓ కొలిక్కి వస్తాయనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నూతనంగా ఏర్పడిన కాటారం సబ్ డివిజన్ కార్యాలయం తమకు అందుబాటులో ఉంటుంది. నూతన డివిజన్ కార్యాలయంలోకి భూ సేకరణ పత్రాలు పూర్తిస్థాయిలో తీసుకు రావాలి. ఏళ్లుగా పెండింగ్ సమస్యలను అధికారులు పరిష్కరించి నాయ్యం చేయాలి.

- ఎల్లయ్య, భూనిర్వాసితుల కమిటీ సభ్యుడు, తాడిచర్ల, మల్హర్

చెక్‌డ్యాం వద్ద నాయకుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామ శివారులో ప్రభుత్వంలో నిర్మించిన చెక్‌డ్యాంను ధ్వంసం చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం చెక్‌డ్యాం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకుడు తొటం నవీన్, పాండ్రాల వీరస్వామి, ఆరెపల్లి సమ్మయ్య, అశోక్, రాజు, సురేందర్, మర్రి నరేశ్, శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క


నివాళులర్పిస్తున్న మధు

మల్హర్: మండలంలోని నాచారం గ్రామంలో సంతోష్, రాజు, శంకర్ ఇటీవల మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ గురువారం పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, పుట్టపాక శ్రీనివాస్, మండల నాయకులు వాలా యాదగిరి రావు, శ్రీశైలం, సది, రాజేందర్, భాస్కర్, పాషా, సమ్మయ్య, సుధాకర్, వెంకయ్య, కుమార్ పాల్గొన్నారు.

ఎస్‌ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని కామారం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొర్నబెల్లి రాఘవరావు బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని గురువారం మంత్రి సీతక్క పరామర్శించి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు రేగ కల్యాణి, మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, నాయకులు యానాల సిద్దిరెడ్డి, జనార్దన్ పాల్గొన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన పండుగ సునీల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు గురువారం క్షతగాత్రుడిని పరామర్శించారు.

బియ్యాల జనార్దన్‌రావుకు నివాళి


నివాళులర్పిస్తున్న ఉద్యోగులు, నాయకులు

ములుగు: ప్రొఫెసర్ డాక్టర్ బియ్యాల జనార్దన్‌రావు వర్ధంతిని ఆదివాసీ ఉద్యోగులు, తుడుందెబ్బ, పెసా కమిటీ, ఆదివాసీ యువత ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించారు. జనార్దన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు ఆదివాసీ ఉద్యోగులు మాట్లాడుతూ.. జనార్దన్‌రావు ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని పోరాడారని తెలిపారు. తెలంగాణ నీళ్లు, నిధులు, నియామకాలు, వనరులపై ఆనాడే ప్రశ్నించిన గొప్ప మేధావని కొనియాడారు. మంకిడి రవి, వజ్జ రాజు, ఈక కుమార్, లక్కీ, అన్నవరం, రవికాంత్, పతిరి శ్రీధర్, మంకిడి పూర్ణ, రమీజ్, శ్రీను పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల టెంటు తొలగింపు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో ఎస్సీ కమ్యూనిటీ భవనం వద్ద బీజేపీ నాయకులు గురువారం ఎమ్మెల్సీ టీచర్, పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో టెంటువేసి అందులో కూర్చున్నారు. దీంతో దళితసంఘాల నాయకులు మంచినీళ్ల దుర్గయ్య, శివరాజ్, రాజబాపు, నాగరాజు, సాంబయ్య వెళ్లి కోడ్ ఉందని టెంటు తీయాలన్నారు. బీజేపీ నాయకులు చందుపట్ల సునీల్‌రెడ్డి, నారాయణరెడ్డి తమకు అనుమతి ఉందని తెలిపారు. ఈ క్రమంలో కొంత వాగ్వాదం జరిగింది. అనంతరం పోలీసులు నచ్చచెప్పడంతో బీజేపీ నాయకులు టెంటును తొలగించారు. కాగా, ఎలాంటి గొడవలు జరుగకుండా సీఐ రామచంద్రరావు, ఎస్సై పవన్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రేగొండలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్


చిట్యాల: బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న సిబ్బంది


ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

కాటారం డివిజన్ పరిధిలో ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు అలాగే భూపాలపల్లి నియోజవర్గం పరిధిలో ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికారులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

- సాక్షి నెట్‌వర్క్


కాటారం: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ


మొగుళ్లపల్లి: పోలింగ్ కేంద్రంలో ఆర్డీఓ రవి


మల్హర్: ఓటు వేసేందుకు క్యూలో పట్టభద్రులు


కాళేశ్వరంలో..


కాటారం: ఓటు వేసిన పట్టభద్రులు


పలిమెలలో..


మహదేవపూర్‌లో..

వైభవంగా శివపార్వతుల కల్యాణం


మంగపేట: తాళిని చూపిస్తున్న పూజారి


మంగపేట: పట్టు వస్త్రాలు అందజేస్తున్న ఆలయ చైర్మన్ నరేష్‌రెడ్డి దంపతులు


వాజేడు: కల్యాణానికి హాజరైన భక్తులు


వెంకటాపురం(కె): శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

మంగపేట: మండలంలోని శైవక్షేత్రాల్లో మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని బుధవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఉమా చంద్రశేఖరస్వామి, మల్లూరు శ్రీ శంభులింగేశ్వరస్వామి, రమణక్కపేట స్వయంభు మల్లికార్జునస్వామి, రాజుపేట శ్రీ కొండలింగేశ్వరాస్వామి ఆలయాల్లో ఆయా ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో కల్యాణం చేపట్టారు. పూజారులు నరేష్‌శర్మ, నాగేశ్వర్‌రావు పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవ క్రతువును రాత్రి 11 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు వేద మంత్రోశ్చరణ నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవతా మూర్తుల కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు మండల పరిధిలోని గ్రామాల నుంచి శివరాత్రి జాగారం(ఉపవాసదీక్ష)లో ఉన్న భక్తులు తరలివచ్చి తిలకించారు. ఉమాచంద్ర శేఖరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ నరేష్‌రెడ్డి, సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భరతనాట్యం ప్రదర్శించి ఉత్తమ ప్రతిభను కనబర్చిన సహస్రను అభినందిస్తు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్ మెమొంటోను జ్ఞాపికగా బహూకరించారు. రాజుపేటలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి మంత్రి సీతక్క తనయుడు సూరి హాజరయ్యారు. రాజుపేట, రమణక్కపేటలో దేవతా మూర్తుల కల్యాణానిక మాజరైన భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు సీఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎస్సై సూరి ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

కనుల పండుగగా కల్యాణం

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శ్రీ ఉమా రామలింఘేశ్వర స్వామి కల్యాణం బుధవారం రాత్రి వేదపండితుల మంత్రోత్సరణలతో మంగళ వాయిద్యాల నడుమ కన్నుల పండుగగా నిర్వహించారు. రాత్రి 10 గంటలకు స్థానిక వేప చెట్టు సెంటర్‌లో ఎదురుకోలు సన్నాహక కార్యక్రమం చేపట్టారు. మండల పరిధిలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తుల సమక్షంలో రాత్రి 11 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహించారు.

వాజేడు: మండల పరిధిలోని జంగాలపల్లి, ప్రగళ్లపల్లి, అయ్యవారి పేట గ్రామాల్లో శివ పార్వతుల కల్యాణ మహోత్సవం బుధవారం అర్ధరాత్రి 12:00 గంటలకు ఘనంగా నిర్వహించారు. జంగాలపల్లిలోని సతీసమేత ఉమా రామలింగేశ్వర స్వామికి ఉత్సవ కల్యాణాన్ని జరిపించారు. ప్రగళ్లపల్లి గ్రామంలో గ్రామస్తులు స్థానిక శివాలయం వద్ద శ్రీ కాశీ ఉమారామ లింగేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాత అయ్యవారిపేట గ్రామంలో గోదావరి నది సమీపంలో ఉన్న నూతనంగా నిర్మించిన శివాలయంలో శివ పార్వతుల కల్యాణం ఘనంగా చేశారు.

ఘనంగా వసంతోత్సవం


దేవతామూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఏటూరునాగారం: మండలంలోని శ్రీఉమారామ లింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం అనంతరం గురువారం దేవతమూర్తులకు ఊరేగింపు(వసంతోత్సవ) కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్లకిలో దేవతలను గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి స్వాగతిస్తూ నీళ్ల ఆరబోసి కొబ్బరికాయలను కొట్టారు. తీర్థప్రసాదాలను అర్చకుడు రాజ్‌కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మడుగూరి ప్రసాద్, డైరెక్టర్లు రాధిక, కిరణ్, తిరుపతి, పోషాలు, రాంలాల్, ఆలయ పెద్ద గుంత రమేష్‌లతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

అలాగే రామన్నగూడెంలో శివలింగానికి పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేసినట్లు అర్చకులు సాయి తెలిపారు. శివరాత్రి సందర్భంగా వేకువజా మున లింగోద్భవం జరిగిన తర్వాత శివలింగానికి సీఐ శ్రీనివాస్ పంచామృత అభిషేకాలను చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వాజేడు: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు


వెంకటాపురం(కె)లో..


మంగపేట: భరతనాట్యం ప్రదర్శించిన సహస్రకు మెమొంటోను అందజేస్తున్న సీఐ శ్రీనివాస్ దంపతులు

మండల కమిటీ ఎన్నిక


ఎన్నికైన కమిటీ సభ్యులు

మంగపేట: మండల కేంద్రంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం మండల నూతన కమిటీని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తిపాక రాము ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బుచ్చంపేటకు చెందిన నక్క యాకయ్య గౌడ్, ఉపాధ్యక్షుడిగా తోట అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా చిప్ప రోహిత్ కుమార్, కోశాధికారిగా కుదురుపాక చిట్టిబాబు, గౌరవ సలహదారుడిగా బండపల్లి రవీందర్ గౌడ్, కమిటీ సభ్యులుగా బట్ట నర్సింహారావు, కటుకోజు ప్రశాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు జిల్లా అధ్యక్షుడు రాము నియామక పత్రాలను అందజేశారు.

బియ్యం అందజేత

గోవిందరావుపేట: మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన మాడ జగ్గారావు రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ ఆధ్వర్యంలో నాయకులు గురువారం పరామర్శించి 25 కేజీల బియ్యం అందజేశారు. వెంకట్ రెడ్డి, మండల కార్యదర్శి మల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న పుట్ట మధు

మల్హర్: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నాచారం మల్లన్న గుట్టుపై రెండో రోజు గురువారం నిర్వహించిన మల్లికార్జున స్వామి పెద్ద పట్నానికి మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మల్లికార్జున స్వామిని దర్శించుకోని మొక్కలు చెల్లించుకున్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, కాసాని శ్రీశైలం పాల్గొన్నారు.

అగ్నిగుండాలపై నడిచిన భక్తులు


ఆయల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అగ్నిగుండం

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో గల అతి పురాతనమైన కాకతీయుల నాటి శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మహా శివరాత్రి ఉత్సవాలు బుధవారం అర్ధరాత్రి వరకు వైభవంగా కొనసాగాయి. అర్ధరాత్రి 2గంటలకు అగ్ని గుండాలు ఏర్పాటు చేయగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అగ్ని గుండాలపై నడిచి భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ తాటిపాముల అనుదీప్‌శర్మ, మాజీ సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి, జాగృతి యువత రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్, తడక ఈశ్వర్, కోత్వాల్ కిరణ్ ఉన్నారు.

ప్రహరీ పక్కనే చెత్తకు నిప్పు..


పాఠశాల ప్రహరీ పక్కన కాలుస్తున్న చెత్త

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రహరీ చుట్టుపక్కల పాఠశాల సిబ్బంది చెత్తను, కోడిగుడ్డు పొచ్చెలను కుప్పలుగా పోసి కాలుస్తున్నారు. దీంతో క్లాస్‌రూంలోకి పొగ వ్యాపించి విద్యార్థినులు శ్వాసకోశకు గురైయ్యే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ పాఠశాల సిబ్బంది తీరులో మార్పు రావడం లేదని పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రిన్సిపాల్ ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.